సాక్షి
అనకాపల్లి
మంగళవారం । 11 । మార్చి । 2025



ఉభయ దేవేరులతో కల్యాణ కాంతులీనుతున్న ఉపమాక వెంకన్న



కనుల పండువగా ఎదురు సన్నాహ మహోత్సవం

కనుల పండువగా వెంకన్న
కల్యాణోత్సవాలు

భక్తులే పెళ్లి పెద్దలయ్యారు. శ్రీవారికి, దేవేరులకు నేత్రపర్వంగా కల్యాణోత్సవాలు జరిపిస్తున్నారు. అర్చక స్వాముల ఇంట స్వామివారిని, ఉభయనాంచారులను ఎదురెదురుగా ఉంచి భక్తులు జరిపిన పెళ్లిమాటలు, కట్నకానుకల కార్యక్రమం (కన్యావరుణ సంవాదం) ఆద్యంతం ముగ్ధులను చేసింది.



ధ్వజారోహణ కార్యక్రమం నిర్వహిస్తున్న అర్చకులు

నక్కపల్లి: ఉపమాక క్షేత్రంలో కలియుగ వైకుంఠనాథుని తిరుకల్యాణోత్సవాల్లో భాగంగా సోమవారం తెల్లవారుజామున 2 గంటలకు గరుడాద్రి పర్వతంపై కల్కి అవతారంలో వెలసిన మూలవిరాట్‌కు పంచామృతాలతో అభిషేకం, తొలిపూజ నిర్వహించారు. స్వర్ణాభరణాలతో అలంకరించిన శ్రీదేవీ, భూదేవీ సమేత శ్రీ వేంకటేశ్వరస్వామిని పెద్దపల్లకిలో వేంచేయింపజేసి ఉపమాక మాడ వీధుల్లో తిరువీధి సేవ నిర్వహించారు. అనంతరం ఆలయంలో ధ్వజస్తంభం వద్ద ధ్వజారోహణ కార్యక్రమాన్ని ఆలయ ప్రధానార్చకులు గొట్టుముక్కల వరప్రసాద్, అర్చక స్వాములు సంకర్షణపల్లి కృష్ణమాచార్యులు, శేషాచార్యులు వేదమంత్రోచ్చారణల మధ్య నిర్వహించారు. ధ్వజపటాన్ని ఎగురవేస్తూ అష్టదిక్పాలకులు, దేవతలను స్వామివారి కల్యాణానికి ఆహ్వానించడం జరిగిందని, ధ్వజారోహణతో కల్యాణోత్సవాలు లాంఛనంగా ప్రారంభమయినట్లేనని అర్చక స్వాములు తెలిపారు. విశాఖ నుంచి తెచ్చిన ఆభరణాలను స్వామివారి ఉత్సవమూర్తులకు అలంకరించి ధ్వజస్తంభం ఎదురుగా ఉన్న అద్దాల మండపంలో ఉంచి భక్తులకు దర్శనం కల్పించారు. ఉదయం 9 గంటలనుంచి భక్తుల రాక ఒక్కసారిగా పెరిగిపోవడంతో కిలోమీటరు దూరం క్యూలైన్లలో భక్తులు వేచి ఉండాల్సిన పరిస్థితి వచ్చింది.

నేత్రపర్వంగా ఎదురు సన్నాహమహోత్సవం

కల్యాణ తంతులో భాగంగా సోమవారం రాత్రి ఎదురు సన్నాహ మహోత్సవం జరిగింది. దీనినే కన్యావాద సంవాదం (పెళ్లిమాటల తంతు) అంటారు. వేంకటేశ్వరస్వామిని ఇత్తడి గరుడ వాహనంపైన, ఉభయదేవేరులను ఇత్తడి సప్పరం



సప్పరం వాహనంపై అమ్మవారు, ఇత్తడి గరుడ వాహనంపై స్వామివారు

వాహనంపై ఉంచి చిన్నవీధి, పెద్ద వీధులలో ఊరేగించారు. ఉపమాక సింహాద్రాచార్యులు ఇంటి వద్ద పెళ్లిమాటల తంతు నిర్వహించారు. విశ్రాంత తెలుగు పండిట్ డాక్టర్ గొట్టుముక్కల గాయత్రీదేవి స్వామివారి, అమ్మవార్ల గుణగణాలను, కీర్తిప్రతిష్ఠలను వివరించిన సన్నివేశం భక్తులను మంత్రముగ్ధుల్ని చేసింది. అనంతరం శ్రీదేవి, భూదేవి సమేతుడైన శ్రీవేంకటేశ్వరస్వామిరిని రథంపై ఉంచి తిరువీధుల్లో రథోత్సవం నిర్వహించారు. హోం మంత్రి వంగలపూడి అనిత, కలెక్టర్ విజయ కృష్ణన్, డీఐజీ గోపీనాథ్ జెట్టి, ఎస్పీ తుహిన్ సిన్హా స్వామిని దర్శించుకున్నారు.

వడ్డాదిలో పోటెత్తిన భక్తులు

బుచ్చెయ్యపేట: వడ్డాది వేంకటేశ్వరస్వామి 152వ కల్యాణ మహోత్సవాలు సోమవారం ఘనంగా ప్రారంభమయ్యాయి. ఐదు రోజుల కల్యాణ వేడుకల్లో భాగంగా ఏకదశి తొలిరోజు స్వామి వారికి ప్రత్యేక పూజలు, హోమాలు, తిరువీధి ఉత్సవం నిర్వహించారు. తెల్లవారుజాము నుంచి ఆలయం ముందు భక్తులు బారులు తీరారు. ఆలయ వంశపారంపర్య ధర్మకర్త దొండా కన్నబాబు కుటుంబ సభ్యులకు తొలి దర్శనం కల్పించి



ప్రత్యేక అలంకరణలో వడ్డాది వేంకటేశ్వరస్వామి

ప్రత్యేక పూజలు చేయించి స్వామివారి ప్రసాదాలు అందించారు. భక్తుల గోవింద నామస్మరణతో గిరిజాంబ కొండ మార్మోగింది. కోటాటాలు, చిడతల భజనల మధ్య సాయంత్రం స్వామివారికి తిరువీధి ఉత్సవం నిర్వహించారు. స్వామి పల్లకిని మోయడానికి పలువురు భక్తులు పోటీపడ్డారు. రాత్రికి గిరిజాంబ కొండపైన ఆలయ కల్యాణ మండపంలో స్వామి వారి కల్యాణాన్ని వేలాదిమంది భక్తుల సమక్షంలో వేడుకగా నిర్వహించారు. దేవస్థానం ఈవో శర్మ దగ్గరుండి పూజా కార్యక్రమాలు చేయించి ప్రసాదాలు అందించారు. రాత్రికి ఆలయం వద్ద వడ్డాది నాలుగు రోడ్ల జంక్షన్‌లో వర్తక సంఘం ఏర్పాటు చేసిన పలు సాంస్కృతిక కార్యక్రమాలు భక్తుల్ని అలరించాయి.

- ఫ్యాక్టరీ సమస్యలు పరిష్కరించకుంటే ఆందోళనకు సిద్ధం
- గోవాడ చెరకు రైతులకు బాసటగా నిలిచిన వైఎస్సార్‌సీపీ
- వారి కష్టాలు తెలుసుకున్న శాసనమండలి ప్రతిపక్ష నేత బొత్స సత్యనారాయణ
- సమస్యలను శాసనమండలిలో ప్రస్తావిస్తామని హామీ



గోవాడ ఫ్యాక్టరీ యార్డులో బొత్స నేతృత్వంలోని వైఎస్సార్‌సీపీ నాయకుల బృందంతో తమ గోడు వెళ్లబోసుకుంటున్న చెరకు రైతులు

చెరకు రైతుల పక్షాన త్వరలో
ఉద్యమం

చోడవరం:

గోవాడ చెరకు రైతులకు వైఎస్సార్‌సీపీ బాసటగా నిలిచింది. సుగర్ ఫ్యాక్టరీలో తరచూ క్రషింగ్‌కు అంతరాయం కలగడంతో చెరకు రైతులు కొద్ది రోజులుగా చాలా ఇబ్బందులు పడుతున్నారు. వారికి అండగా నిలిచి, వారి సమస్యలను ప్రభుత్వానికి ఎలుగెత్తి చాటేందుకు మేమున్నామంటూ వైఎస్సార్‌సీపీ ముందుకు వచ్చింది. శాసనమండలి ప్రతిపక్ష నేత బొత్స సత్యనారాయణ, మాజీ ఉప ముఖ్యమంత్రి బూడి ముత్యాలనాయుడు, మాజీ మంత్రి గుడివాడ అమర్‌నాథ్, మాజీ ప్రభుత్వ విప్ కరణం ధర్మశ్రీ, ఎమ్మెల్సీ వరుదు కల్యాణి, మాజీ ఎమ్మెల్యే అన్నంరెడ్డి అదీప్‌రాజ్, జెడ్పీ చైర్‌పర్సన్ సుభద్రతో కూడిన వైఎస్సార్‌సీపీ ప్రతినిధుల బృందం సోమవారం గోవాడ సుగర్ ఫ్యాక్టరీని సందర్శించింది. ఇక్కడి యార్డులో నిలిచిపోయిన చెరకు బళ్లను పరిశీలించి రైతులతో మాట్లాడి వారి సమస్యలు, ప్రస్తుత ఫ్యాక్టరీ పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. తమకు గతేడాది చెరకు బకాయిలు ఇంకా ఇవ్వలేదని, ఈ ఏడాది 40 రోజులు ఆలస్యంగా క్రషింగ్ ప్రారంభించారని, ఫ్యాక్టరీ మిషనరీలో మరమ్మతుల వల్ల ఈ సీజన్‌లో అనేక సార్లు క్రషింగ్ ఆగిపోయిందని, ఈ ఏడాది సరఫరా చేసిన చెరకుకు ఇంకా పేమెంట్స్ ఇవ్వలేదని రైతులు తమ గోడు వెళ్లబోసుకున్నారు. కూటమి ప్రభుత్వం వస్తే ఫ్యాక్టరీని బాగుచేస్తామని, రైతులకు రూ.4 వేలు గిట్టుబాటు ధర ఇస్తామని చెప్పిన ఎంపీ సీఎం రమేష్, ఎమ్మెల్యే రాజు, బండారు ఇప్పుడు రైతులు సమస్యలు ఎదుర్కొంటున్నా ఇటువైపు కన్నెత్తి చూడలేదని మరికొంతమంది రైతులు ఆగ్రహంతో చెప్పారు. వైఎస్ జగన్ సీఎంగా ఉన్నప్పుడు పలుసార్లు ఫ్యాక్టరీకి సాయం చేశారని, ఆ డబ్బులతో ఎప్పటికప్పుడు చెరకు బకాయిలు చెల్లించడంతో పాటు ఫ్యాక్టరీ ఓవరాయిలింగ్ పనులు కూడా పూర్తిగా చేసేవారని, కూటమి ప్రభుత్వం వచ్చాక ఒక్క రూపాయి కూడా సాయం చేయకపోవడంతో రైతులకు, కార్మికులకు బకాయిలు చెల్లించలేదని, ఫ్యాక్టరీని ప్రభుత్వం, స్థానిక ఎమ్మెల్యేలు, ఎంపీ పూర్తిగా పట్టించుకోలేదని రైతులంతా ముక్తకంఠంతో చెప్పారు. వైఎస్సార్‌సీపీ రైతులకు అండగా ఉండేందుకు ముందుకు రావడం ఆనందంగా ఉందని, తమ సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లండంటూ రైతులు సమస్యలు విన్నవించారు.

రాజకీయాలు చేయడానికి రాలేదు

రైతుల ఆవేదన విన్న బొత్స సత్యనారాయణ మాట్లాడుతూ.. ప్రభుత్వం, ఫ్యాక్టరీ యాజమాన్యం వెంటనే రైతుల సమస్యలు పరిష్కరించకపోతే చెరకు రైతుల తరఫున త్వరలో ఉద్యమానికి దిగుతామని చెప్పారు. రాజకీయాలు చేయడానికి తాము ఇక్కడికి రాలేదని, చెరకు రైతుల సమస్యలు తెలుసుకొని వారికి అండగా నిలవాలనే వచ్చామని బొత్స చెప్పారు. చెరకు రైతులు రాష్ట్ర ప్రజలు కారా...వారిని పట్టించుకోవాల్సిన బాధ్యత ప్రభుత్వంపై లేదా అని ప్రశ్నించారు. చెరకు రైతుల సమస్యలను శాసనమండలిలో ప్రస్తావిస్తామని చెప్పారు. ఫ్యాక్టరీకి తక్షణ సాయంగా రూ.35 కోట్లు విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ఈ విషయాన్ని త్వరలో జరగనున్న శాసనమండలి సమావేశాల్లో ప్రభుత్వం దృష్టికి వైఎస్సార్‌సీపీ తీసుకెళుతుందని ఆయన చెప్పారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ఐదేళ్ల పాలనలో రూ.89 కోట్లు సాయంగా ఇచ్చి ఫ్యాక్టరీని అప్పుల ఊబిలోంచి బయటకు తెచ్చిందని, రైతుల పక్షపాతిగా జగన్‌మోహన్‌రెడ్డి అన్ని విధాలుగా సాయం అందించారన్నారు.

ఇప్పుడు ఉన్న ప్రజాప్రతినిధులు, కూటమి ప్రభుత్వం పూర్తిగా చెరకు రైతులను, ఫ్యాక్టరీని విస్మరించిందని ధ్వజమెత్తారు. ఎంపీ ఎక్కడి నుంచో వచ్చారని, ఆయన ఈ ప్రాంతం వారు కాకపోవడంతో ఇక్కడ రైతులు, ఫ్యాక్టరీ సమస్యలు ఆయనకు పట్టవన్నారు. కానీ స్థానిక ఎమ్మెల్యేలు ఇక్కడి వారే కాబట్టి వారైనా ఈ సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించడానికి కృషి చేయకపోవడం విచారకరమన్నారు. రైతులకు అన్యాయం జరిగితే వైఎస్సార్‌సీపీ చూస్తూ ఉండదని, వారికి అండగా ఉంటుందని బొత్స సత్యనారాయణ అన్నారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి ఏడువాక సత్యారావు, జిల్లా యూత్ అధ్యక్షుడు పుల్లేటి వెంకటేష్, జిల్లా ప్రధాన కార్యదర్శి నాగులాపల్లి రాంబాబు, ఉపాధ్యక్షురాలు బొగ్గు శ్యామల, జిల్లా రైతు విభాగం అధ్యక్షుడు బొడ్డేడ సూర్యనారాయణ, మండల అధ్యక్షుడు దొడ్డి వెంకట్రావు తదితరులు పాల్గొన్నారు.



మీడియాతో మాట్లాడుతున్న బొత్స సత్యనారాయణ

తప్పుల తడకగా సీనియారిటీ జాబితా

- అప్పీళ్లకు ముగిసిన గడువు
- సవరణల కోసం 250 మంది దరఖాస్తులు

విశాఖ విద్య: ఉపాధ్యాయుల సీనియారిటీ జాబితాలు ప్రకటించేందుకు విద్యాశాఖాధికారులు ఆపసోపాలు పడుతున్నారు. టీచర్ ఇన్ఫర్మేషన్ సిస్టమ్(టీఐఎస్)లో సమగ్ర వివరాలు నమోదు సమయంలో ఉపాధ్యాయుల అలసత్వం, డీడీవోల నిర్లక్ష్యంతో జాబితాలు తప్పులతడకగా మారాయి. వీటి ఆధారంగానే త్వరలోనే ప్రమోషన్లు ఇస్తామని ప్రభుత్వం ప్రకటించటంతో ఉపాధ్యాయుల్లో కలవరం మొదలైంది. దీంతో సీనియారిటీ జాబితా లో లోపాలను సవరించి, తమకు న్యాయం చేయా లని కోరుతూ ఉమ్మడి విశాఖ జిల్లాకు సర్వీసు విషయాల్లో నోడల్ అధికారిగా వ్యవహరిస్తున్న విశాఖ జిల్లా డీఈవోకు తమ మొర విన్నవించుకునేందుకు ఉపాధ్యాయులు క్యూ కట్టారు. అప్పీళ్లకు సోమ వారం చివరి రోజు కావటంతో ఉమ్మడి జిల్లాలో పనిచేస్తున్న 250 మంది ఉపాధ్యాయులు దరఖాస్తు చేసుకున్నారు.

అప్పీళ్ల పరిశీలనకు ప్రత్యేక కమిటీ

వచ్చిన దరఖాస్తులను క్షుణ్ణంగా పరిశీలించే నిమిత్తం 12 మంది సీనియర్ ప్రధానోపాధ్యాయులు, ఇద్దరు ఎంఈవోలతో జిల్లా స్థాయిలో కమిటీ ఏర్పాటు చేశారు. వచ్చిన ప్రతీ దరఖాస్తును వారు పరిశీలించిన తరువాతనే టీఐఎస్ లాగిన్‌లో వాటిని సరిచేశారు. ఇలా 210 దరఖాస్తులను సోమవారం నాటికి ఒక కొలిక్కి తీసుకొచ్చి, ఉపాధ్యాయులు లేవనెత్తిన అంశాలను సరిచేశారు. మరో 40 వరకు దరఖాస్తులు అభ్యంతరాలతో కూడినవి కావటంతో.. మరోసారి క్షేత్రస్థాయి నుంచి నివేదికలను తెప్పించుకున్న తరువాతనే వాటిని సీనియారిటీ జాబితాలో చోటు కల్పించేలా చర్యలు చేపట్టారు.

జాబితాలపై ఉన్నత స్థాయి సమీక్ష

ఉపాధ్యాయుల సీనియారిటీ జాబితాలు, సవరణల కోరుతూ వచ్చిన అప్పీళ్ల విషయమై సోమవారం విద్యాశాఖ కమిషనరేట్ కార్యాలయం నుంచి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష చేశారు. ఉమ్మడి



అప్పీళ్లను స్వీకరిస్తున్న కమిటీ సభ్యులు

విశాఖ జిల్లా నుంచి డీఈవో ప్రేమ్‌కుమార్, సర్వీసు వ్యవహారాలు చూసే అసిస్టెంట్ డైరెక్టర్ అరుణ జ్యోతి, సంబంధిత సెక్షన్ అధికారులు, ఉద్యోగులు పాల్గొని, వివరాలను తెలియజేశారు.

ఆందోళన వద్దు

సీనియారిటీ జాబితాల్లో తప్పిదాలపై ఉపాధ్యాయులు ఎటువంటి ఆందోళన చెందాల్సిన అవసరం లేదు. ఉమ్మడి జిల్లాలో అన్ని క్యాడర్ల వారీగా పూర్తి స్థాయిలో సమగ్ర పరిశీలన చేసిన తరువాతనే తుది జాబితాలను వెల్లడిస్తాం. జాబితాల్లో ఎలాంటి అభ్యంతరాలు ఉన్నా.. ఉపాధ్యాయులు నేరుగా మా దృష్టికి తీసుకురావచ్చు.

– ఎన్.ప్రేమ్‌కుమార్, నోడల్ అధికారి, ఉమ్మడి విశాఖ జిల్లా

బెంగళూరు స్పెషల్‌కు యలమంచిలిలో హాల్ట్

తాటిచెట్లపాలెం (విశాఖ): విశాఖ-యలమంచిలి-విశాఖ స్పెషల్ ఎక్స్‌ప్రెస్‌కు యలమంచిలిలో అదనపు హాల్ట్ కల్పిస్తున్నట్లు వాల్తేర్ డివిజన్, సీనియర్ డివిజనల్ కమర్షియల్ మేనేజర్ సందీప్ తెలిపారు. విశాఖ-ఎస్ఎంవీ బెంగళూరు (08549) స్పెషల్ ఎక్స్‌ప్రెస్‌కు ఈ నెల 16వ తేదీ నుంచి (రైలు నడిచే రోజుల్లో), తిరుగు ప్రయాణంలో ఈ నెల 17వ తేదీ నుంచి య లమంచిలిలో హాల్ట్ కల్పిస్తున్నారు. విశాఖ-ఎస్ఎంవీ బెంగళూరు ఎక్స్‌ప్రెస్ ఆ రోజుల్లో యలమంచిలికి సాయంత్రం 4.34గంటలకు చేరుకుని, 4.35 గంటలకు బయల్దేరుతుంది. ఎస్ఎంవీ బెంగళూరు-విశాఖపట్నం స్పెషల్ ఎక్స్‌ప్రెస్ ఆయా రోజుల్లో యలమంచిలికి ఉదయం 10.29 గంటలకు చేరుకుని, 10.30గంటలకు బయల్దేరుతుంది.

రంజాన్ వేళలు

	ఇఫ్తార్ మంగళ	సహర్ బుధ
అనకాపల్లి	6.10	4.53
నర్సీపట్నం	6.12	4.51

యువత పోరు హోరెత్తాలి

చోడవరం: ఈనెల 12వ తేదీన విద్యార్థులకు ఫీజు రీయింబర్స్‌మెంట్, యువతకు ఉద్యోగ కల్పన, నిరుద్యోగ భృతి హామీలు నెరవేర్చని ప్రభుత్వాన్ని నిలదీసేందుకు వైఎస్సార్‌సీపీ చేపట్టిన యువత పోరు ఆందోళనను అంతా విజయవంతం చేయాలని ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు బూడి ముత్యాలనాయుడు, చోడవరం సమన్వయకర్త గుడివాడ అమర్‌నాథ్ కోరారు. చోడవరం వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో ప్రచార వాల్‌పోస్టర్లను సోమవారం వారు ఆవిష్కరించారు. యువత, విద్యార్థుల పక్షాల వైఎస్సార్‌సీపీ ఎప్పుడూ అండగా ఉంటుందని, ఈ ఉద్యమంలో వారంతా పాల్గొనాలని కోరారు.

విద్యార్థులు, నిరుద్యోగుల తరఫున పోరాటం

అనకాపల్లి: చంద్రబాబు పాలనలో దగాపడ్డ విద్యార్థులు, నిరుద్యోగుల తరఫున యువత పోరు కార్యక్రమాన్ని ఈనెల 12న నిర్వహిస్తున్నామని వైఎస్సార్‌సీపీ యూత్ విభాగం జిల్లా అధ్యక్షుడు పుల్లేటి వెంకటేష్ చెప్పారు. స్థానిక రింగ్‌రోడ్డులోని పార్టీ సమన్వయకర్త మలసాల భరత్‌కుమార్ కార్యాలయంలో సోమవారం యువత పోరు పోస్టర్‌ను ఆవిష్కరించారు. రాష్ట్రవ్యాప్తంగా విద్యార్థులకు బకాయిపడ్డ రూ.4,600 కోట్లు తక్షణమే చెల్లించాలని డిమాండ్ చేశారు. ప్రతి ఏడాది జనవరిలో జాబ్ క్యాలెండర్ ఇచ్చి నిరుద్యోగులకు ఉపాధి కల్పిస్తామని ఎన్నికల మేనిఫెస్టోలో చెప్పిన చంద్రబాబునాయుడు మరోసారి నిరుద్యోగులను మోసగించారన్నారు. అధికారంలోకి వచ్చి తొమ్మిది మాసాలు అవుతున్నప్పటికీ ఒక్కరికీ రూ.3 వేల నిరుద్యోగ భృతి ఇవ్వలేదని పేర్కొన్నారు. జిల్లా ఐటీ వింగ్ విభాగం అధ్యక్షుడు పల్లెల వెంకట సీతమ్మదొర మాట్లాడుతూ డీఎస్సీ కొత్త నోటిఫికేషన్ విడుదల చేసి నేటికీ అమలు చేయకపోవడం ఏమిటని ఆయన ప్రశ్నించారు. పార్టీ విద్యార్థి విభాగం జిల్లా అధ్యక్షుడు బి.హేమంత్ కుమార్ మాట్లాడుతూ విద్యార్థులకు ఫీజుల రీయింబర్స్‌మెంట్ ఇవ్వకపోవడంతో ప్రైవేట్, కార్పొరేట్ కళాశాలల్లో చదువుతున్న విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. విద్యార్థి విభాగం యలమంచిలి అధ్యక్షుడు చదరం అప్పలనాయుడు, వైద్యవిభాగం రాష్ట్ర కార్యదర్శి బొడ్డేడ లక్ష్మీనరసింహరావు, జిల్లా మహిళా విభాగం ప్రధాన కార్యదర్శి మరిపల్లి శోభ, తదితరులు పాల్గొన్నారు.



చోడవరంలో వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న బూడి ముత్యాలనాయుడు, గుడివాడ అమర్‌నాథ్



అనకాపల్లిలో యువత పోరు కార్యక్రమం పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న పుల్లేటి వెంకటేష్

మహిళల రక్షణ కోసం శక్తి టీమ్

- అందరూ యాప్ డౌన్‌లోడ్ చేసుకోవాలి
- హోం మంత్రి అనిత

నక్కపల్లి: మహిళల రక్షణ కోసం శక్తి టీమ్‌లను ఏర్పాటు చేయడంతోపాటు, ప్రత్యేక యాప్‌ను రూపొందించామని రాష్ట్ర హోం, విపత్తుల శాఖ మంత్రి వంగలపూడి అనిత చెప్పారు. సోమవారం నక్కపల్లిలో మాదక ద్రవ్యాల నిర్మూలనపై అవగాహన కల్పిస్తూ పాఠశాల విద్యార్థులు, మహిళా సిబ్బందితో ర్యాలీ నిర్వహించారు. ర్యాలీ అనంతరం నక్కపల్లి డిగ్రీ కళాశాలలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో శక్తి యాప్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మంత్రి అనిత మాట్లాడుతూ ప్రతి మహిళ ఈ యాప్‌ను తమ మొబైల్ ఫోన్‌లో డౌన్‌లోడ్ చేసుకోవాలన్నారు. ఆడపిల్లల రక్షణ కోసం శక్తి టీమ్‌లను రంగంలోకి దించుతున్నామన్నారు. 112 నంబరుకు ఫోన్ చేస్తే 15 నుంచి 20 నిమిషాల్లో శక్తి టీం వస్తుందన్నారు. ఎన్టీపీసీ సాయంతో మాదక ద్రవ్యాలు, మహిళా చట్టాలు, సైబర్ నేరాలపై అవగాహన కల్పించే వాహనాలను మంత్రి ప్రారంభించారు. శక్తి టీమ్ సభ్యుల కోసం ప్రత్యేకంగా సమకూర్చిన 39 వాహనాలు, 11 డ్రోన్స్‌ను మంత్రి ప్రారంభించి పోలీస్ శాఖకు అందజేశారు. డీఐజీ గోపీనాథ్ జెట్టి మాట్లాడుతూ గడచిన ఆరు నెలల కాలంలో గంజాయి కేసుల్లో 500 మందిని అరెస్టు చేశామని, 47 కేసుల్లో శిక్షలు పడ్డాయన్నారు. 11 వేల ఎకరాల్లో సాగయ్యే గంజాయి పంటను 90 ఎకరాలకు పరిమితం చేశామన్నారు. జిల్లాలో గంజాయి నిర్మూలన కోసం 39 చెక్‌పోస్టులు ఏర్పాటు చేశామన్నారు. ఈ సందర్భంగా ఉత్తమ ప్రతిభ కనబరచిన 13 మంది పోలీసు సిబ్బందికి ప్రశంసాపత్రాలు అందజేశారు. కలెక్టర్ విజయ్ కృష్ణన్, ఎస్పీ తుహిన్ సిన్హా, అదనపు ఎస్పీ దేవప్రసాద్, డీఎస్పీ శ్రీనివాసరావు, ఎస్బీ డీఎస్పీ అప్పారావు, పరవాడ డీఎస్పీ విష్ణుస్వరూప్, ట్రైనీ డీఎస్పీ కృష్ణచైతన్య, సీఐలు కుమారస్వామి, రామకృష్ణ, ఎస్ఐ సన్నిబాబు తదితరులు పాల్గొన్నారు.



శక్తి యాప్‌ను ఆవిష్కరిస్తున్న మంత్రి అనిత

అంగన్‌వాడీల నిర్బంధంపై నిరసన హోరు

నర్సీపట్నం: ఇచ్చిన హామీల సాధనకు శాంతియుత నిరసన తలపెట్టిన అంగన్‌వాడీ కార్యకర్తలను ఎక్కడికక్కడ నిర్బంధిస్తున్న ప్రభుత్వ వైఖరిని ఖండిస్తున్నామని సీఐటీయూ జిల్లా కార్యదర్శి అడిగర్ల రాజు పేర్కొన్నారు. అంగన్‌వాడీ కార్యకర్తల అక్రమ అరెస్టులను ఖండిస్తూ సిటు ఆధ్వర్యంలో అంగన్‌వాడీ కార్యకర్తలు ఎన్టీఆర్ స్టేడియం నుంచి ర్యాలీగా బయలుదేరి ఆర్డీవో కార్యాలయానికి చేరుకుని ఆందోళనకు దిగారు. ధర్నాను ఉద్దేశించి రాజు మాట్లాడుతూ.. గత సమ్మె కాలంలో అంగన్‌వాడీలకు ప్రభుత్వం ఇచ్చిన హామీలను అమలు చేయాలని కోరుతూ విజయవాడ వెళ్తున్న కార్యకర్తలను నిర్బంధించడాన్ని ఖండిస్తున్నామన్నారు. వేతన సమస్యను పరిష్కరించకుండా, వయసు రెండేళ్లు పెంచి గతంలో అంగీకరించని, సరైన విధానం లేని గ్రాట్యుటీని అమలు చేస్తామని ప్రభుత్వం ప్రకటించడం అంగన్‌వాడీలను మోసగించడమేనన్నారు. గౌరవ వేతనం ఇస్తూ ప్రభుత్వ ఉద్యోగులుగా చూపుతున్నారని, వారి కుటుంబాల్లోని వికలాంగులు, ఒంటరి మహిళలకు పెన్షన్ ఇవ్వడం లేదన్నారు. రేషన్ కార్డులు తొలగించడంతో అంగన్‌వాడీలు ఆరోగ్యశ్రీకి నోచుకోలేదన్నారు. నర్సీపట్నం, గొలుగొండ ప్రాజెక్టుల నాయకులు వి.సామరాజ్యం, పి.వరలక్ష్మి, ఆర్.కృష్ణవేణి, రమణమ్మ, హైమా, శాంతికుమారి తదితరులు పాల్గొన్నారు.



ఆర్డీవో కార్యాలయం వద్ద ఆందోళన చేస్తున్న అంగన్‌వాడీ కార్యకర్తలు

ఉచితం పేరుతో అనుచితం

విద్యార్థుల తల్లిదండ్రుల ఆందోళన

తుమ్మపాల: విద్య హక్కు చట్టం ద్వారా చదువుతున్న పేద విద్యార్థులను ఫీజులు చెల్లించాలని ఒత్తిడి తెస్తున్న పాఠశాలలపై చర్యలు తీసుకోవాలని భారత విద్యార్థి ఫెడరేషన్ (ఎస్ఎఫ్ఐ) నాయకులు డిమాండ్ చేశారు. కలెక్టరేట్ వద్ద పీజీఆర్ఎస్ సందర్భంగా ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో జిల్లా నాయకులు నిర్వహించిన నిరసన కార్యక్రమం అనంతరం కలెక్టర్ విజయ్ కృష్ణన్‌కు వినతి పత్రం అందించారు. ఈ సందర్భంగా జిల్లా కార్యదర్శి ఎం.రమణ మాట్లాడుతూ విద్యార్థులను ఫీజుల ఒత్తిడికి గురిచేస్తున్న పాఠశాలలపై చర్యలు తీసుకోకపోవడం అన్యాయమని, గతంలో రెండుసార్లు కలెక్టర్‌కు విన్నవించినప్పటికీ ఎటువంటి చర్యలు లేవన్నారు. పట్టణంలో గుడ్‌షెపర్డ్, విద్యాధరి, శ్రీ చైతన్య, నారాయణ, భాష్యం లాంటి స్కూళ్లు విద్యార్థుల తల్లిదండ్రుల నుంచి అధిక ఫీజులు వసూలు చేస్తున్నాయన్నారు. అధికారులు పట్టించుకోవడం లేదని, ఉచితంగా ఇవ్వాల్సిన సీట్లకు కూడా ఫీజులు చెల్లించాలని వత్తిడి చేయడం తీవ్ర అన్యాయమన్నారు. అధికారులు స్పందించి ఈ పాఠశాలలపై చర్యలు తీసుకోవాలని, ఉచిత విద్య పథకంలో చదువుతున్న విద్యార్థుల నుంచి వసూలు చేసిన ఫీజులు తిరిగి వెనక్కు చెల్లించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో పలువురు విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.



ఉచిత విద్యకు ఫీజుల వసూలుపై నిరసన చేస్తున్న ఎస్ఎఫ్ఐ, తల్లిదండ్రులు

గిరిజన గ్రామాల్లో దాహం దాహం

ఖాళీ బిందెలతో మోకాళ్లపై నిరసన

మాడుగుల: మండలంలో శంకరం పంచాయతీ గొప్పూరు, తాడివలస గిరిజన గ్రామాల్లో నెలకొన్న తాగునీటి సమస్యను వెంటనే పరిష్కరించాలని ఖాళీ బిందెలతో మహిళలు నిరసన ప్రదర్శన చేశారు. ఆదివాసీ గిరిజన సంఘం నాన్‌షెడ్యూల్ ఏరియా, ఐదవ షెడ్యూల్ సాధన కమిటీ ఆధ్వర్యంలో తమ దాహం తీర్చాలంటూ సోమవారం మోకాళ్లపై కూర్చొని నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆదివాసీ గిరిజన సంఘం నాన్‌షెడ్యూల్ ఏరియా జిల్లా ప్రధాన కార్యదర్శి ఇరటా నరసింహమూర్తి మాట్లాడుతూ.. ఇది వరకు ఈ గ్రామాలకు పైపులైన్ ఏర్పాటు చేసి తాగునీరు అందించారన్నారు. అయితే ప్రస్తుతం సక్రమంగా కొళాయిలు నుంచి తాగునీరు అందకపోవడంతో గిరి మహిళలు ఇబ్బందులు పడుతున్నారన్నారు. అధికారులు వచ్చి మరమ్మతులు చేపడుతున్నా సరే రెండు రోజులు నీరు వచ్చి మళ్లీ పాడవుతున్నాయని వాపోయారు. మళ్లీ షరా మామూలే అయిపోతుందన్నారు. సంబంధిత అధికారులు స్పందించి రెండు గ్రామాలకు తాగునీటి సమస్యలు పరిష్కరించాలని గిరిజన మహిళల తరుపున ఆదివాసీ గిరిజన సంఘం కోరింది. ఈ కార్యక్రమంలో గిరిజన సంఘం మహిళా కార్యకర్తలు గిన్నెపల్లి సన్యాసమ్మ, సోలం మంగ, సోలం వరలక్ష్మి, రాములు తదితరులు పాల్గొన్నారు.



శంకరం పంచాయతీ గొప్పూరులో ఖాళీ బిందెలతో మోకాళ్లపై నిరసన తెలుపుతున్న గిరిజన మహిళలు

క్లుప్తంగా

కూటమి పాలనలో సహకార రంగం నిర్వీర్యం



సావిత్రిబాయి పూలే చిత్రపటానికి పూల మాల వేసి నివాళులర్పిస్తున్న సీపీఎం నాయకులు

అనకాపల్లి టౌన్: సహకార రంగాన్ని నిర్వీర్యం చేయడమే రాష్ట్ర ప్రభుత్వం ధ్యేయంగా కనిపిస్తుందని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు అన్నారు. స్థానిక సీపీఎం కార్యాలయంలో సోమవారం జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఎన్నికల హామీలను అమలు చేయడంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు చిత్తశుద్ధి లేదన్నారు. మూడు నెలలుగా గోవాడ సుగర్ ఫ్యాక్టరీ రైతుల బకాయిలు, రైతులకు చెల్లించాల్సిన చెరకు బకాయిలు సుమారు రూ.35 కోట్లు ఉందన్నారు. ఎన్నికలకు ముందు పార్లమెంట్ సభ్యుడు సి.ఎం రమేష్ రూ.100 కోట్లు నిధులను తీసుకొచ్చి జిల్లాలో సుగర్ ఫ్యాక్టరీలను ఆధునీకరిస్తానని చెప్పి తీరా అధికారంలోకి వచ్చిన తర్వాత కనిపించడం లేదన్నారు. రాష్ట్రంలో 14 సహకార చక్కెర కర్మాగారాలు ఉండేవని, వాటిలో చాలా వరకు సీఎంగా ఉన్న చంద్రబాబు అమ్మేశారని తెలిపారు. సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు లోకనాథం మాట్లాడుతూ బడ్జెట్‌లో సహకార రంగానికి నిధులు కేటాయించలేదని విమర్శించారు. రైతులకు సకాలంలో బకాయిలు చెల్లించకపోవడంతో చెరకు విస్తీర్ణత శాతం తగ్గిపోయిందని, దీంతో రైతులు ప్రత్యామ్నాయ పంటల వైపు మొగ్గు చూపుతున్నారన్నారు. ముందుగా సామాజిక విప్లవ నాయకురాలు సావిత్రిబాయి పూలే చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. ఈ సమావేశంలో సీపీఎం పార్టీ జిల్లా కార్యదర్శి జి.కోటేశ్వరావు, మండల కార్యదర్శి గంటా శ్రీరామ్‌లు పాల్గొన్నారు.

డిపార్ట్‌మెంటల్ ఆఫీసర్ విధుల నుంచి తొలగింపు

నర్సీపట్నం: స్థానిక ఏబీఎం కాలేజీ ఇంటర్ పరీక్ష కేంద్రంలో డిపార్ట్‌మెంటల్ ఆఫీసర్ ఎం.ఎ.వి. ప్రసాద్‌ను విధుల నుంచి తొలగిస్తూ ఇంటర్మీడియట్ విద్యాశాఖ అధికారి సుజాత ఆదేశాలు ఇచ్చారు. రోలుగుంట ప్రభుత్వ జూనియర్ కాలేజీలో ప్రసాద్ బోటనీ లెక్చరర్‌గా పనిచేస్తున్నారు. ఇంటర్ పరీక్షల నిమిత్తం అతనిని ఏబీఎం కాలేజీ పరీక్ష కేంద్రానికి డిపార్ట్‌మెంటల్ ఆఫీసర్‌గా నియమించారు. పరీక్షకు హాజరైన విద్యార్థులను స్లిప్పుల పేరుతో ప్రత్యేక గదిలోకి తీసుకెళ్లి బట్టలు విప్పించి ఇబ్బందులకు గురి చేశారు. ఒక విద్యార్థి తల్లిదండ్రులు నేరుగా అమరావతి ఉన్నత విద్యాశాఖ కమిషనర్‌కు ఫిర్యాదు చేశారు. కమిషనర్ ఆదేశాలతో జిల్లా ఇంటర్ విద్యాశాఖ అధికారి ప్రసాద్‌ను విధుల నుంచి తొలగించి, మాకవరపాలెం ప్రభుత్వ జూనియర్ కళాశాల లెక్చరర్ లతను అతని స్థానంలో డిపార్ట్‌మెంటల్ ఆఫీసర్‌గా నియమించారు. ప్రసాద్‌ను అమరావతి ఇంటర్ బోర్డు వద్ద హాజరు కావాలని ఆదేశించారు.

కారు ఢీకొని బైకిస్టుకు గాయాలు

మునగపాక : మండలంలోని నాగవరం శివారు వెంకన్నపాలెం వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో బైకిస్టుకు తీవ్రగాయాలయ్యాయి. ఎస్‌ఐ ప్రసాదరావు తెలిపిన వివరాలివి. కూర్మన్నపాలెం ప్రాంతానికి చెందిన కె. అశోక్ సోమవారం అచ్యుతాపురం నుంచి బైక్‌పై పరవాడ వైపునకు వస్తున్నాడు. అదే సమయంలో పరవాడ నుంచి అచ్యుతాపురం వైపునకు వెళుతున్న కారు బైక్‌ను బలంగా ఢీకొట్టింది. దీంతో బైక్ నడుపుతున్న అశోక్ కాలికి తీవ్ర గాయాలు కావడంతో అతనిని గాజువాకలోని ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ప్రసాదరావు తెలిపారు.

అర్జీదారులతో సందడిగా కలెక్టరేట్



అర్జీలు స్వీకరిస్తున్న కలెక్టర్ విజయ కృష్ణన్, డీఆర్వో సత్యనారాయణరావు



ఆరు బయటే అధికారుల కోసం వేచి చూస్తున్న దివ్యాంగులు



భూసమస్యపై కలెక్టర్‌ను కలిసేందుకు వచ్చిన వృద్ధురాలు సీతయ్యమ్మ

- నెల తరువాత మొదలైన పీజీఆర్ఎస్
- అర్జీలు భూ సమస్యలపైనే అధికం
- ఆరు బయటే దివ్యాంగులు, వృద్ధులు

తుమ్మపాల : ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల కారణంగా కలెక్టరేట్‌లో నెల రోజుల పాటు నిలిపివేసిన ప్రజా సమస్యల పరిష్కార వ్యవస్థ కార్యక్రమం సోమవారం పునఃప్రారంభమైంది. జిల్లా నలుమూలల నుంచి వచ్చిన అర్జీదారులతో కలెక్టరేట్ పరిసరాలు నిండిపోయాయి. అర్జీల వివరాలు ఆన్‌లైన్ చేసేందుకు పది శిబిరాలను ఏర్పాటు చేశారు. ప్రాంగణంలో ఏర్పాటు చేసిన టెంట్ వద్ద సచివాలయ ఉద్యోగులు నిరక్షరాసులు, వృద్ధులు, వికలాంగుల సమస్యలు తెలుసుకుని అర్జీలు తయారు చేశారు. సమస్యల ఆధారంగా అర్జీలపై నమోదు చేసిన రిఫరెన్స్‌తో ఆన్‌లైన్ చేసి మొదటి అంతస్తు పీజీఆర్ఎస్ వేదికపైకి పంపించడంతో కలెక్టర్, డీఆర్వో, ఇతర జిల్లా అధికారులు అర్జీదారుల సమస్యలు తెలుసుకుని అర్జీలు స్వీకరించారు. ఈ సందర్భంగా పెండింగ్ అర్జీలపై వెంటనే చర్యలు తీసుకోవాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. అర్జీలకు పరిష్కారం చూపడమే కాకుండా, పరిష్కారం కాని దరఖాస్తులకు వివరంగా సమాధానం ఇవ్వాలని సూచించారు. సోమవారం మొత్తం 440 అర్జీలు నమోదవ్వగా అందులో అత్యధికం భూ సమస్యలపైనే కావడం గమనార్హం.

దివ్యాంగులు, వృద్ధులు ఆరు బయటే...

భౌతికంగా తమను చూసి జాలితోనైనా సమస్య పరిష్కారానికి కలెక్టర్ కృషి చేస్తారనే గంపెడు ఆశతో జిల్లా సరిహద్దుల నుంచి సైతం వృద్ధులు, వికలాంగులు కలెక్టరేట్‌కు చేరుకుంటే వారిని సిబ్బంది ఆరుబయటే నిలిపివేశారు. దీంతో నేరుగా కలెక్టర్‌ను కలిసి తమ గోడు చెప్పుకునే అవకాశం లేక వెనుతిరుగుతున్నారు. కలెక్టరేట్‌లో ఏర్పాటు చేసిన వీల్ చైర్లు, లిఫ్ట్ ద్వారా తామే స్వయంగా కలెక్టర్‌ను కలవగలమని, కానీ అందుకు అవకాశం ఇవ్వలేదని ఆవేదన చెందారు. భూ సమస్యపై పాయకరావుపేట మండల నుంచి కుటుంబ సభ్యుల సహాయంతో వచ్చిన 95 ఏళ్ల వృద్ధురాలికి కలెక్టర్‌ను కలిసే అవకాశం ఇవ్వలేదు. దీంతో ఆమె అర్జీని ఇతరులతో పీజీఆర్ఎస్‌లో నమోదు చేయించి జిల్లా అధికారులకు పంపించారు.





కోరుకొండ పెదసాధు   కంచి రాము

వివాదంలో ఉన్న భూమి ఆన్‌లైన్‌పై ఫిర్యాదు

కోర్టు వివాదంలో ఉన్న భూమిని ఆన్‌లైన్ చేసి, భూ ఆక్రమణకు ప్రోత్సహిస్తున్న అధికారులపై చర్యలు తీసుకోవాలని కోరుతూ పాయకరావుపేట మండలం పదాలవాని లక్ష్మీపురం గ్రామానికి చెందిన పదిలం సీతయ్యమ్మ (95 ఏళ్ల వృద్ధురాలు)తో ఆమె కుటుంబ సభ్యులు కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. గ్రామంలో సర్వే నెం.155, 158, 153, 164, 162లో పలు సబ్ డివిజన్‌లలో తన భర్త వాటాకు గల వ్యవసాయ భూములు తన పేరున పట్టాదారు పాసుపుస్తకాలు ఉన్నప్పటికీ తప్పుడు పత్రాలతో కుటుంబ సభ్యులు కోర్టుకు వెళ్లడంతో ప్రస్తుతం సదరు అంశం కోర్టు పరిధిలో ఉంది. భూమిని ఇరువురికి కూడా ఆన్‌లైన్ చేయవద్దంటూ డిస్ప్యూట్ రిజిస్టర్‌లో కూడా నమోదు చేయడం జరిగిందని, కానీ రీ సర్వేలో వీఆర్వోతో పాటు సర్వేయర్, రెవెన్యూ అధికారులు సదరు భూములను తన కుటుంబ సభ్యుల పేరి ఆన్‌లైన్ చేయడంతో వారు భూమిని ఆక్రమించే ప్రయత్నం చేస్తున్నారని, వారి నుంచి తనకు ప్రాణహాని కూడా ఉందని వృద్ధురాలు తెలిపారు. కలెక్టర్, జిల్లా అధికారులు తక్షణమే విచారణ చేపట్టి తనకు న్యాయం చేయాలని కోరారు. అయితే కలెక్టర్‌ను స్వయంగా కలిసి తన బాధ చెప్పుకునే అవకాశం లేకపోవడంపై ఆమె నిరాశ వ్యక్తం చేసింది.

ఇంటి పట్టా కోసం మూడేళ్లుగా ఎదురు చూపులు

ప్రభుత్వ భూమిలో ఉన్న ఇంటికి క్రమబద్ధీకరణ పత్రం అందిస్తామని చెప్పి జీవో నెం.225 ద్వారా రూ.2.17 లక్షలు కట్టించుకుని నేటికీ పట్టా ఇవ్వడం లేదని అనకాపల్లి మండలం అక్కిరెడ్డిపాలెం గ్రామానికి చెందిన కోరుకొండ పెదసాధు పీజీఆర్ఎస్‌లో ఫిర్యాదు చేశారు. పైకప్పు రేకులుగా ఉన్న ఇంటికి శాశ్వత హక్కు పత్రం వస్తుందనే ఆశతో మూడేళ్లుగా ఎదురుచూస్తున్నా ఎవరూ పట్టించుకోవడం లేదని, కూలి పనులు చేసుకునరి దాచుకున్న సొమ్మంతా సచివాలయంలో కడితే బిల్లు ఇచ్చి సరిపెట్టేసారని, కలెక్టరమ్మ చొరవ చూపి తనకు న్యాయం చేయాలని కోరారు.

బ్యాటరీ ట్రైసైకిల్ మంజూరు చేయరూ...

వికలాంగుడనైన తన జీవనోపాధి కోసం బ్యాటరీ ట్రై సైకిల్ మంజూరు చేయాలని చీడికాడ మండలం తిరువోలు గ్రామానికి చెందిన కంచి రాము అర్జీ చేసుకున్నాడు. నిరుపేద అయిన తాను 40 ఏళ్ల నుంచి గ్రామంలో చిన్న కిల్లీబడ్డీ పెట్టుకుని జీవిస్తున్నానని, ఈ నెల 9న విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో కిల్లీబడ్డీతో పాటు తన బండి కూడా కాలిపోయిందని, సరుకులు తెచ్చుకుని అమ్ముకుని జీవనోపాధి పొందేందుకు బ్యాటరీ బండి మంజూరు చేయాలని కోరారు.

ఎస్పీ కార్యాలయానికి 31 అర్జీలు



అర్జీదారుల సమస్యలను తెలుసుకుంటున్న ఎస్పీ తుహిన్ సిన్హా

అనకాపల్లి : స్థానిక ఎస్పీ కార్యాలయంలో సోమవారం ప్రజా సమస్యల పరిష్కార వేదికకు 31 అర్జీలు వచ్చినట్లు ఎస్పీ తుహిన్ సిన్హా చెప్పారు. ఎస్పీ అర్జీదారుల నుంచి ఫిర్యాదులను స్వీకరించి, వారి సమస్యలను తెలుసుకున్నారు. చట్టపరిధిలో ఉన్న సమస్యలను త్వరితగతిన పూర్తి చేస్తామని, ఆస్తి తగాదాలు, కుటుంబ సమస్యలు, చీటింగ్ వంటి వాటిపై అర్జీలు వచ్చాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో అదనపు ఎస్పీ ఎల్.మోహన్‌రావు, ఎస్ఐ డి.వెంకన్న పాల్గొన్నారు.

పి-4 సర్వే వేగవంతం చేయాలి



పి-4 సర్వేపై వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడుతున్న కలెక్టర్ విజయకృష్ణన్

తుమ్మపాల : పేదరికం నిర్మూలన లక్ష్యంగా ప్రభుత్వ, ప్రవేటు, ప్రజల భాగస్వామ్యంతో (పి4) సర్వే ప్రక్రియను వేగవంతం చేయాలని కలెక్టర్ విజయకృష్ణన్ ఎంపీడీఓలను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లోని మినీ కాన్ఫరెన్స్ హాల్లో పి -4 సర్వే, పంచాయతీరాజ్, జీఎస్‌డబ్ల్యూఎస్, డ్వామా, జిల్లా పరిషత్, ఆర్‌డబ్ల్యూఎస్ శాఖలపై వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష జరిపారు. పల్లె పండగ కార్యక్రమంలో భాగంగా బీటీ, సీసీ రోడ్లను మార్చి చివరినాటికి పూర్తి చేయాలన్నారు. ఈ వారం స్వర్ణాంధ్ర స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో భాగంగా ఇంటింటికి తిరిగి చెత్త సేకరించి, తడి, పొడి చెత్తను వేరు చేసి సేంద్రియ ఎరువుగా మార్చాలని సూచించారు. పాఠశాలల ప్రహరీ పనులు, గోకులం షెడ్ల నిర్మాణాలు సత్వరం పూర్తి చేయాలని ఆదేశించారు. తాగునీటి వాటర్ ట్యాంక్‌లను శుభ్రపరిచి, మరమ్మతులు, క్లోరినేషన్ చేపట్టాలన్నారు. ఉపాధి పనులను, కేటాయించిన పనిదినాల్లో లక్ష్యాలను పూర్తి చేయాలని ఆదేశించారు. జిల్లా ముఖ్య ప్రణాళిక అధికారి జి.రామారావు, జిల్లా పంచాయతీరాజ్ ఈఈ వీరునాయుడు, డ్వామా పీడీ పూర్ణిమ దేవి, జిల్లా పంచాయతీ అధికారి శిరీషారాణి, జెడ్పీ సీఈవో నారాయణమూర్తి, ఆర్‌డబ్ల్యూఎస్ ఈఈ రామస్వామి పాల్గొన్నారు.

పూర్వ తహసీల్దార్‌పై కలెక్టర్‌కు ఫిర్యాదు

యలమంచిలి రూరల్ : యలమంచిలి పూర్వ తహసీల్దార్ ఎస్.రాణి అమ్మాజీపై చర్యలు తీసుకోవాలని కోరుతూ రేగుపాలెం మాజీ సర్పంచ్ కొల్లి సత్యనారాయణ జిల్లా కలెక్టర్ విజయకృష్ణన్, అనకాపల్లి ఆర్డీవో ఆయిషాలకు సోమవారం ఫిర్యాదు చేశారు. యలమంచిలి మండలం రేగుపాలెం గ్రామ పరిధి సర్వే నంబర్లు 167/1,167/3లో 2.91 ఎకరాల ప్రభుత్వ భూమిని యలమంచిలి పూర్వపు తహసీల్దార్ రాణి అమ్మాజీ ఉద్దేశపూర్వకంగా ఒక రియల్టర్ పేర జిరాయితీగా రికార్డులను మార్పు చేసి ఆ భూమి అమ్మకం జరిగేలా చేసి ప్రభుత్వానికి నష్టం కలిగించారని ఫిర్యాదులో పేర్కొన్నారు. అంతేకాకుండా ఇటీవల ఆ భూమిని కొనుగోలు చేసిన ఒక సిమెంటు పరిశ్రమ యాజమాన్యం పక్కనే ఉన్న ఎర్రచెరువుతో పాటు పక్కనే ఉన్న శ్మశానవాటిక స్థలాన్ని కూడా ఆక్రమించి గ్రామ పంచాయతీ అనుమతులు లేకుండా భారీ ప్రహరీ గోడ నిర్మిస్తున్నా అధికారులు పట్టించుకోలేదని ఫిర్యాదులో తెలిపారు. తప్పు జరిగినట్టు స్పష్టంగా కనిపిస్తున్నా ఈ అక్రమ వ్యవహారంపై ఉన్నతాధికారులు ఎందుకు చర్యలు తీసుకోవడంలేదో అర్థంకావడం లేదని మాజీ సర్పంచ్ సందేహం వ్యక్తపరిచారు. దీనికి సంబంధించి ఇటీవల సాక్షి దినపత్రికలో ప్రచురితమైన వార్తల క్లిప్పింగులను కూడా ఫిర్యాదుదారు తన ఫిర్యాదుతో జతపరిచారు.

నీ వెంటే.. నేనూ !

- భర్తకు పెద్దకర్మ చేస్తూ భార్య మృతి
- రామానాయుడుపాలెంలో విషాదం

యలమంచిలి రూరల్: నీలో నేను సగమంటూ భార్యాభర్తలు భావిస్తుంటారు. దంపతుల మధ్య అన్యోన్యత ఎక్కువైనప్పుడు, ఇద్దరిలో ఏ ఒక్కరు దూరమైనా, మిగిలిన వారు తీవ్ర వేదనకు గురవుతారు. నీవులేని బతుకు నాకెందుకంటూ కుమిలిపోతుంటారు. చనిపోయిన భర్తకు పెద్దకర్మ నిర్వహిస్తుండగానే, అతని భార్య నీ వెంటే నేనంటూ తుది శ్వాస విడిచింది. మున్సిపాలిటీ పరిధి రామానాయుడుపాలెంలో తీవ్ర విషాదం నింపిన ఈ సంఘటన వివరాలు.. ఈ నెల 1న రామానాయుడుపాలెం గ్రామానికి చెందిన రావి తాతారావు నాయుడు (60) అనారోగ్యంతో చనిపోయారు. సోమవారం కుటుంబసభ్యులు, బంధువులు పెద్దకర్మ నిర్వహిస్తుండగా ఊహించని షాక్ తగిలింది. తాతారావునాయుడు చిత్రపటానికి భార్య నాగమణి (50) పుష్పాలు వేసి పూజ చేసి నివాళులర్పిస్తూ, అందరూ చూస్తుండగానే గుండెపోటుతో కుర్చీలో కూలబడిపోయింది. బంధువులు, కుటుంబ సభ్యులు కంగారుగా వెళ్లి చూసేసరికి నాగమణి ప్రాణాలు విడిచింది. వివాహమైనప్పటి నుంచి ఈ దంపతులిద్దరూ ఎంతో అన్యోన్యంగా, ఆదర్శంగా ఉండేవారని బంధువులు స్థానికులు చెప్పారు. సోమవారం సాయంత్రమే ఆమెకు పెద్ద కుమార్తె లీలావతి అంత్యక్రియలు నిర్వహించారు.





రావి తాతారావు, నాగమణి (ఫైల్)



తల్లి నాగమణికి అంత్యక్రియలు నిర్వహిస్తున్న లీలావతి

రోడ్డున పడిన 400 మంది కార్మికులు

- వేతనాలు వేస్తామని నమ్మబలికి అందుబాటులో లేని లలిత ఫెర్రో యాజమాన్యం
- ఆందోళన చేపట్టిన కార్మికులు



పరిశ్రమ గేటు బయట ఆందోళన చేపడుతున్న కార్మికులు

అచ్యుతాపురం రూరల్ : వేతనాలు అకౌంట్లలో వేస్తామని కార్మికులను నమ్మబలికి వారిని రోడ్డున పడేసిన రాజ్ రాజేశ్వరి లలిత త్రిపుర సుందరి ఫెర్రో పరిశ్రమ యాజమాన్యంపై కార్మికులు మండిపడుతున్నారు. సోమవారం నాటికి తమ అకౌంట్లలో వేతనాలు వేస్తామని చెప్పి తరువాత ఫోన్‌లు ఎత్తకుండా మోసం చేయడంపై కార్మికులు ఆందోళనకు దిగారు. వారికి సీఐటీయు జిల్లా ఉపాధ్యక్షుడు రొంగలి రాము అండగా నిలిచారు. ఎటువంటి ముందస్తు సమాచారం లేకుండా పరిశ్రమ లాక్ అవుట్ చేసి కార్మికులను రోడ్డున పడేయడం అన్యాయమన్నారు. ఉపాధి పేరున వేల కోట్ల రాయితీలు పొందుతూ రూ. కోట్ల విలువైన భూములను తీసుకుని పరిశ్రమలు నెలకొల్పి నిరుద్యోగ యువతీ యువకులకు ఉద్యోగాలు, ఉపాధి కల్పిస్తామని చెప్పి నిర్వాసితులకు మోసగించారన్నారు. కార్మికులకు న్యాయబద్ధంగా ఇవ్వాల్సిన హామీలు నెరవేర్చకుండా దొంగచాటున పరిశ్రమలో ఉన్న ఉత్పత్తి మెటీరియల్‌ని తరలించడంపై చర్యలు తీసుకోవాలన్నారు. ఇదివరకు కార్మికులకు హామీ ఇచ్చిన పరిశ్రమల ప్రతినిధులను సైతం యాజమాన్యం విధుల నుంచి తొలగించారు. ఈ నేపథ్యంలో కార్మికులు పరిశ్రమ గేటు బయట ఆందోళన చేపట్టారు. సుమారు 400 కుటుంబాలు రోడ్డున పడ్డాయన్నారు. క్యాంటీన్‌లో పనిచేస్తున్న ఆరుగురు కార్మికులు ఆరు సంవత్సరాలుగా విధులు నిర్వహిస్తున్నారన్నారు. వారికి వేతనాలతో పాటు గ్రాట్యూటీ ఇచ్చి ఆదుకోవాలన్నారు. ముందస్తు నోటీసులు ఇవ్వకుండా కార్మికులను నిర్దాక్షిణ్యంగా విధుల నుంచి తొలగించిన పరిశ్రమ యాజమాన్యంపై ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకోవాలని సీఐటీయూ నాయకులు డిమాండ్ చేశారు.



క్యాంటీన్‌లో పనిచేసే నిరుపేద కార్మికులు

నీలకంఠాపురంలో చోరీ

- ఇంటి తాళాలు పగలగొట్టి 6 తులాలు బంగారం, రూ.30 వేలు నగదు అపహరణ

బుచ్చెయ్యపేట : మండలంలో గల శివారు పంచాయతీ నీలకంఠాపురం గ్రామంలో గుర్తు తెలియని వ్యక్తులు ఇంటి తాళాలు పగలగొట్టి 6 తులాల బంగారు వస్తువులు, రూ. 30 వేలు నగదు పట్టుకుపోయారు. గ్రామానికి చెందిన పడాల శంకర్రావు సోమవారం ఉదయం తన కుమార్తె కాలేజీకి వెళ్లిపోవడంతో తాను కాయగూరలు అమ్మడానికి వెళ్లిపోయారు. సాయంత్రం ఇంటికొచ్చేసరికి ఇంటి తాళాలు పగలగొట్టి ఉండడాన్ని చూసి ఆందోళన చెందారు. ఇంట్లో దాచిన బంగారం, నగదు మాయమవడంతో దొంగతనం జరిగినట్టు గుర్తించారు. దీనిపై స్థానికులు బుచ్చెయ్యపేట పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు సంఘటన స్థలానికి చేరి విచారణ చేస్తున్నారు.

విజేత ఆగ్రోఫామ్స్ డిపాజిట్‌దారులకు త్వరలో నగదు చెల్లింపులు

తుమ్మపాల: గత కొన్ని సంవత్సరాలుగా డిపాజిట్ సొమ్ము కోసం ఎదురుచూస్తున్న విజేత ఆగ్రో ఫామ్స్ డిపాజిట్‌దారులకు లిక్విడేటర్ ద్వారా త్వరలోనే డబ్బులు చెల్లించాలని హైకోర్టు ఆదేశించిందని విజేత డిపాజిట్‌దారుల సంక్షేమ సంఘం అధ్యక్షుడు నారాయణరావు, సెక్రటరీ సత్యనారాయణ తెలిపారు. విజేత సంస్థను నమ్మి చాలామంది పెట్టుబడి పెట్టారని, 2002 నుంచి గడువు తీరినా డిపాజిట్‌దారులకు సొమ్ము ఇవ్వకుండా విజేత సంస్థ మోసం చేయడంతో అనేక ధర్నాలు, రాస్తారోకోలు, సమ్మెలు, నిరాహారదీక్షలు చేపట్టామని చెప్పారు. కోర్టులో వేసిన కేసు, తమ ప్రయత్నాలు ఫలించి అనుకూలంగా తీర్పు వచ్చిందన్నారు. డిపాజిట్‌దారులు తమ వద్ద ఉన్న బాండ్లు, రసీదులు, పాస్‌బుక్‌ల జెరాక్స్‌తోపాటు రూ.20 స్టాంప్ పేపర్ మీద నోటరీ చేయించి 10 రోజుల్లోగా పట్టణంలో విజేత డిపాజిట్ సంక్షేమ సంఘం కార్యాలయంలో అందజేయాలన్నారు. మరిన్ని వివరాల కోసం ఫోన్ నెం. 6301566542ను సంప్రదించాలన్నారు.

కారు ఢీకొని వ్యక్తి మృతి



రమేష్ (ఫైల్)

మాడుగుల రూరల్ : తాటిపర్తి శివారు గరికబంద గ్రామ సమీపంలో సోమవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో పాడేరు గ్రామానికి చెందిన వేమగిరి రమేష్(47) మృతి చెందారు. ఎస్‌ఐ జి. నారాయణరావు సోమవారం విలేకరులకు తెలిపిన వివరాలివి. పాడేరు గ్రామానికి చెందిన వేమగిరి రమేష్ తన ద్విచక్రవాహనంపై మాడుగుల నుంచి పాడేరు వెళ్తుండగా, తాటిపర్తి శివారు గరికబంద సమీపంలో పాడేరు నుంచి మాడుగుల వైపు వస్తున్న కారు బలంగా ఢీకొట్టింది. దీంతో రమేష్ తలకు బలమైన గాయాలు తగిలాయి. వెంటనే రమేష్‌ను అనకాపల్లి ఎన్టీఆర్ ఆస్పత్రికి తీసుకెళ్లగా, అప్పటికే రమేష్ చనిపోయాడు. ఘటనపై రమేష్ సోదరుడు వేమగిరి వెంకట సత్యనారాయణ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్‌ఐ తెలిపారు.

క్లుప్తంగా

అగమ్యగోచరంగా సీఆర్పీల భవితవ్యం



జిల్లా కో ఆర్డినేటర్ జయప్రకాష్‌కు వినతిపత్రం అందజేస్తున్న సభ్యులు

అనకాపల్లి టౌన్: జిల్లాలో 129 స్కూల్ కాంప్లెక్స్‌లను 78 క్లస్టర్లుగా కుదించడంతో మిగిలిన సీఆర్పీల భవితవ్యం అగమ్యగోచరంగా మారిందని ఏపీ సీఆర్పీ హక్కుల సాధన సమితి జిల్లా సంఘం ప్రతినిధి బి. అచ్యుత కృష్ణ తెలిపారు. క్లస్టర్ రిజర్వ్ మొబైల్ టీచర్స్ సమగ్ర శిక్ష అడిషనల్ ప్రాజెక్ట్ జిల్లా కో ఆర్డినేటర్ జయప్రకాష్‌కు సోమవారం ఆయన వినతిపత్రం అందజేశారు. జిల్లాలో ఖాళీగా ఉన్న 17 సీఆర్ఎంటీ పోస్టులను తక్షణమే భర్తీ చేయాలన్నారు. కార్యక్రమంలో పూడి వెంకట్రావు, జి. నూకేశ్వరావు, లక్ష్మణ పాల్గొన్నారు.

మెషీన్ లెర్నింగ్‌పై అవగాహన



మాట్లాడుతున్న శ్రీనివాస్‌రెడ్డి

అనకాపల్లి టౌన్: పట్టణంలోని దాడి ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఇంజనీరింగ్ అండ్ టెక్నాలజీ అటానమస్ కళాశాలలో '' మెషీన్ లెర్నింగ్ మేడ్ ఈజీ'' అంశంపై గెస్ట్ లెక్చర్ కార్యక్రమం సోమవారం జరిగింది. తమిళనాడు వెల్లూరు యూనివర్సిటీ సీనియర్ ప్రొఫెసర్ ఈదర శ్రీనివాస్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, మెషీన్ లెర్నింగ్‌లో మెలకువలు, అడ్వాన్స్‌డ్ అంశం అయిన క్వాంటం, డీప్ లెర్నింగ్, అంశాలపై అవగాహన కల్పించారు. ప్రిన్సిపాల్ డాక్టర్ ఆర్ వైకుఠరావు, వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ గణేష్ ప్రసాద్ రెడ్డి, ఏ వెంకటేశ్వరావు, విద్యార్థులు పాల్గొన్నారు.

నాణ్యతలో రాజీపడకుండా రోడ్డు నిర్మాణం

అనకాపల్లి టౌన్: నాణ్యతా ప్రమాణాలు తప్పనిసరిగా పాటించి, ఎక్కడా రాజీపడకుండా రోడ్డు నిర్మించాలని సర్పంచ్ తట్ట పెంటయ్య నాయుడు సూచించారు. తుమ్మపాల గ్రామంలో గవరపేట వీధి శివాలయం నుంచి బొజ్జన్న కొండ వరకు చేపట్టిన సీసీరోడ్డు నిర్మాణ పనులను సోమవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రోడ్డు నిర్మాణంతో బొజ్జన్న కొండ వద్దకు వెళ్లడానికి సౌకర్యంగా ఉంటుందన్నారు. 15వ ఆర్థిక సంఘం నుంచి రూ.20 లక్షలు, మండల పరిషత్ నిధులు నుంచి రూ.20 లక్షలు, ఎన్ఆర్‌జీఈఎస్ నుంచి రూ.30 లక్షలు కలిపి రూ.70 లక్షలతో ఈ అభివృద్ధి పనులు చేపడుతున్నట్లు వివరించారు.

ఎంబ్రాయిడరీలో శిక్షణ

పెందుర్తి: స్థానిక ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల ఆవరణలో ఉన్న స్కిల్ హబ్‌లో ఉచిత హ్యాండ్ ఎంబ్రాయిడరీ శిక్షణ ఇవ్వనున్నట్లు ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్.చంద్రశేఖర్ సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. మొత్తం 3 నెలల పాటు జరిగే ఈ శిక్షణ కోసం 8వ తరగతి చదివి 18–45 ఏళ్ల వయసు కలిగిన మహిళలు అర్హులన్నారు. ఈ నెల 20లోపు దరఖాస్తులు చేసుకోవాలన్నారు. వివరాలకు 99669 65502 నెంబర్లో సంప్రదించాల్సిందిగా సూచించారు.

బెల్లం ధరలు



అనకాపల్లి బెల్లం మార్కెట్‌కు సోమవారం 8,319 దిమ్మలు వచ్చాయి.

దిమ్మల రకం	కనిష్ట ధర	గరిష్ట ధర
స్పెషల్ రకం	3,700	4,650
మొదటి రకం	3,590	4,120
రెండో రకం	3,220	3,780
మూడోరకం	2,300	3,210

అనకాపల్లి సినిమాలు

రిటర్న్ ఆఫ్ ది డ్రాగన్ : రాజా
పౌరుషం : సత్యనారాయణ స్క్రీన్-2 (ఉదయం, మ్యాట్నీ)
యాంటీరేష్ : సత్యనారాయణ స్క్రీన్-2 (1, 2 షోలు)
మజాకా : పర్తిసాయి
ఛావా : షిర్డీసాయి
కింగ్స్‌స్టన్ : వెంకటేశ్వర
తండేల్ : శ్రీసత్య
శబ్దం : రామచంద్ర

రక్త నిల్వలు

అనకాపల్లి: జిల్లా ఎన్టీఆర్ వైద్యాలయ రక్తనిధి కేంద్రంలో 73 యూనిట్ల రక్తం నిల్వ ఉంది. ఏ పాజిటివ్-9 యూనిట్లు, బీ పాజిటివ్-26 యూనిట్లు, ఓ పాజిటివ్-38 యూనిట్లు శుద్ధి చేసిన రక్తం నిల్వ ఉంది. అవసరమైన వారు వైద్యాలయం బ్లడ్‌బ్యాంకు టెక్నీషియన్ యు.లోకేష్ (9703619706)ను సంప్రదించవచ్చు.

గ్యాస్ సమాచారం

అనకాపల్లి: ఇండేన్ గ్యాస్ ఏజెన్సీ ద్వారా సోమవారం 397 మంది గ్యాస్ బుక్ చేసుకున్నారు. గతంలో బుక్ చేసుకున్న వారిలో 346 మందికి సిలిండర్లు సరఫరా చేశారు. వివరాలకు ఇండేన్ గ్యాస్ ఏజెన్సీ ప్రతినిధి 08924-223595 నంబరును సంప్రదించవచ్చు.

జంక్షన్.. టెన్షన్

- ప్రమాదకరంగా నూకాంబిక ఆర్చి జంక్షన్
- దీన్ని దాటాలంటే వాహనదారుల బెంబేలు
- గాలిలో కలిసిపోతున్న ప్రాణాలు
- పరిష్కారం చూపడంలో కూటమి ప్రభుత్వ నిర్లక్ష్య వైఖరి



జంక్షన్ పనిచేయని సిగ్నల్ లైట్లు



ప్రమాదాలకు నిలయంగా మారిన నూకాంబిక అమ్మవారి జాతీయ రహదారి జంక్షన్

అనకాపల్లి టౌన్: జిల్లా కేంద్రంగా ఏర్పడిన అనకాపల్లి పట్టణానికి ఎంతో ప్రాధాన్యత పెరిగింది. ఇక్కడ జిల్లా స్థాయి ప్రభుత్వ కార్యాలయాలు ఏర్పాటు కావడంతో వివిధ సమస్యలపై గ్రామాల నుంచి వస్తున్న వారి సంఖ్య పెరిగింది. దాంతో గతంలో కంటే ట్రాఫిక్ సమస్యలు పెరుగుతున్నాయి. దీనికితోడు పట్టణంలో పలు జంక్షన్లు ప్రమాదకరంగా మారాయి. ప్రధానంగా అనకాపల్లి జాతీయ రహదారి నూకాంబిక అమ్మవారి ఆర్చి జంక్షన్ దాటాలంటే ప్రాణాలు అరచేతిలో పెట్టుకోవాల్సిందే. రెప్పపాటులో ప్రాణాలు గాలిలో కలిసిపోతున్నాయి. ఎంతో ప్రాధాన్యత ఉన్న ఈ జంక్షన్‌ను కూటమి పాలకులు పట్టించుకోవడం మానేశారు. ఏడాదికి సుమారు 15 నుంచి 20 మంది ప్రాణాలు పోతున్నాయి. గవరపాలెం నుంచి జాతీయ రహదారి దాటుకోని పలువురు రైతులు తమ పశువులతో సమీపంలో తోటాడ గ్రామంలో పొలాలకు నిత్యం వెళ్తుంటారు. గవర్ల అనకాపల్లి, వెంకటాపురం, సిరసపల్లి గ్రామాల ప్రజలు అనకాపల్లి రావాలన్నా, ఇటు విశాఖపట్నం అటు యలమంచిలి వైపు నుంచి ఉత్తరాంధ్రలోనే ప్రఖ్యాతి గాంచిన నూకాలమ్మ గుడికి రావాలన్నా ఇక్కడ జాతీయ రహదారి దాటాల్సి ఉంటోంది. ఈ రహదారిపై ప్రయాణించాలంటే అతి వేగంగా వచ్చే వాహనాలను చూస్తూ రావాలి. కాని తొందరగా గమ్యం చేరుకోవాలని రోడ్డు దాటుతూ రైతులు ప్రాణాలు పోగొట్టుకున్న సందర్భాలు కోకొల్లలుగా ఉన్నాయి.

పని చేయని సిగ్నల్ లైట్లు..

పలు విన్నపాల మేరకు ఈ జంక్షన్‌లో సిగ్నల్ లైట్లు ఏర్పాటు చేశారు. ప్రస్తుతం అవి పనిచేయడం లేదు. కొద్దిపాటి నిధులతో సిగ్నల్ లైట్లు బాగుచేసినా ప్రమాదాలను నివారించవచ్చు. అలాగే ఈ జంక్షన్‌కు సుమారు 200 మీటర్ల దూరంలో కర్రివారి వీధి ఉంది. అక్కడి నుంచి జాతీయ రహదారిని దాటుకొని సమీపంలో ఆవ ఖండం భూములు ఉన్న రైతులు కూడా తమ ద్విచక్ర వాహనాలతో డివైడర్ దాటుతుంటారు. అటువంటి సమయాలలో భారీ వాహనాలు వారిని ఢీ కొడుతున్నాయి. ఆ ప్రాంతంలో డివైడర్ దాటకుండా తగిన రక్షణ ఏర్పాట్లు చేయాలి. ఈ సమస్యను పరిష్కరించడానికి గత ప్రభుత్వంలో ఈ ప్రాంతంలో అండర్ బ్రిడ్జి నిర్మించాలని ప్రతిపాదనలు పంపారు. ఇంతలో సార్వత్రిక ఎన్నికలు రావడంతో కూటమి అధికారంలోకి రావడంతో పెండింగ్‌లో ఉండిపోయింది. ఇప్పటికైనా కూటమి పాలకులు దృష్టి సారించి ప్రమాదాల నివారణకు శాశ్వత పరిష్కారం చూపాలని పట్టణ వాసులు కోరుతున్నారు.

సిగ్నల్ లైట్లు పనిచేయక..



రాత్రి వేళల్లో తీవ్ర ఇబ్బందులు పడుతూ రోడ్డు దాటాల్సి వస్తోంది. రెప్పపాటులో ప్రాణాలు పోతున్నాయి. సిగ్నల్ లైట్లు ఉన్నా ప్రయోజనం లేకుండా పోయింది. కనీసం వాటిని బాగుచేసినా ప్రయోజనం కలుగుతుంది.

–ధర్మారావు, రైతు అనకాపల్లి

పోలీసు బీట్ ఏర్పాటు చేయాలి



ఈ ప్రాంతంలో అండర్ బ్రిడ్జి నిర్మించాలని ఎన్నో సార్లు విన్నపాలు చేశాం. లారీ డ్రైవర్లు అతివేగంతో వెళ్తున్నారు. దాంతో పలువురు ప్రాణాలు కోల్పోవడంతోపాటు గాయాల పాలయ్యారు. ఇప్పటికైనా రాత్రి సమయంలో పోలీసు బీట్ ఏర్పాటు చేయాలి.

– కొణతాల రవి, అనకాపల్లి

ప్రమాదాల నివారణకు చర్యలు

నూకాంబిక అమ్మవారి ఆలయం వద్ద ప్రమాదాల నివారణకు చర్యలు తీసుకుంటున్నాం. ఇక్కడ సిగ్నల్ లైట్లు నిర్వహణ బాధ్యత నేషనల్ హైవే వాళ్లది. జంక్షన్ దాటేటప్పుడు లారీల వేగం తగ్గించడానికి స్టాపర్స్ బోర్డులను ఏర్పాటు చేశాం.

– ఎం వెంకటనారాయణ, ట్రాఫిక్ సిఐ, అనకాపల్లి

పర్యావరణ పరిరక్షణకు కృషి



కొణతాల ఫణిభూషణ్ శ్రీధర్‌ను శాలువాతో సత్కరిస్తున్న ప్రసాద్

అనకాపల్లి: భావితరాలను దృష్టిలో పెట్టుకుని పర్యావరణ పరిక్షణకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని లయన్స్ క్లబ్ గవర్నర్ ఎన్‌వీబీఎస్ఎస్ ప్రసాద్ తెలిపారు. సోమవారం స్థానిక గాంధీనగరం లయన్స్ క్లబ్ ఆవరణలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ ఏడాది క్లబ్ ఆధ్వర్యంలో పలు సేవా కార్యక్రమాలు నిర్వహించాలని పిలుపునిచ్చారు. అనంతరం జాతీయ ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత, రాష్ట్ర జీవవైవిధ్య సంరక్షకుడు అవార్డు గ్రహీత కొణతాల ఫణిభూషణ్ శ్రీధర్‌ను శాలువాతో సత్కరించారు. కార్యక్రమంలో క్లబ్ అధ్యక్షుడు పిల్లా హరిశ్రీనివాసరావు, కార్యదర్శి డాక్టర్ రాజేష్, సభ్యులు ఉప్పల వెంకటరాజు, వై.సత్యనారాయణ పాల్గొన్నారు.

నేడు పోలిపల్లి జాతర

అనకాపల్లి: మండలంలో తుమ్మపాల పంచాయతీ కొత్తపేట వీధిలో పోలిపల్లి అమ్మవారి జాతర ఈ నెల 11న నిర్వహిస్తున్నట్లు ఆలయ ప్రతినిధి, వైఎస్సార్‌సీపీ సేవాదళ్ జిల్లా కార్యదర్శి సత్యనారాయణ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. తెల్లవారుజాము నుంచి అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహిస్తామన్నారు. సాయంత్రం నేలవేషాలు, చిడతలు, తప్పెటగుళ్లు, కోలాటాలు, విద్యుత్ అలంకరణతో బాణసంచాతో అమ్మవారి జాతర అత్యంత వైభవంగా నిర్వహిస్తామని పేర్కొన్నారు. రాత్రికి స్టేజ్ ప్రోగ్రాంలు వంటి అనేక సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేశామన్నారు.

ఘనంగా వేంకటేశ్వరస్వామి వార్షిక కల్యాణం



వేంకటేశ్వరస్వామి రథం ఊరేగింపు నిర్వహిస్తున్న ఆలయ కమిటీ సభ్యులు

అనకాపల్లి: పాల్గుణ శుద్ధ ఏకాదశి సందర్భంగా స్థానిక దేమునిగుమ్మం వేంకటేశ్వరస్వామి దేవస్థానంలో స్వామివారి వార్షిక కల్యాణ మహోత్సవం సోమవారం ఘనంగా జరిగింది. స్వామివారికి సుప్రభాత సేవ అనంతరం పెండ్లి కుమారునిగా అలంకరించి ఆలయ ప్రధాన అర్చకులు పులఖండం విజయబాబు, గిరిబాబు కల్యాణం జరిపించారు. గరుడ ఆళ్వార్ సందర్భంగా ధ్వజస్తంభం వద్ద ప్రత్యేక పూజలు చేశారు. సాయంత్రం 6 గంటలకు దేవాలయం నుంచి స్వామివారిని ప్రత్యేక రథంపై మంగళ వాయిద్యాలతో ఆచార్యులవారు పురజనులతో మళ్లవరపు వారి వీధిలో కన్యాదాత ఇంటికి ఊరేగింపుగా వెళ్లారు. అక్కడ నుంచి అలివేణి మంగమ్మను ఆలయానికి తీసుకొచ్చారు. అనంతరం ఆలయంలో రాత్రికి వేంకటేశ్వరస్వామి కల్యాణం నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ ఈవో టి.రాజసులోచన, చైర్మన్ బొలిశెట్టి శ్రీనివాసరావు, కమిటీ సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.

నాగులపల్లి గ్రోయిన్ మరమ్మతులు చేయాలి

ఆర్డీవోకు గ్రామ అభివృద్ధి పోరాట కమిటీ వినతి

అనకాపల్లి టౌన్: మూలపేట గ్రామం వద్ద శారదానది ఆనుకున్న ఆనకట్టు నాగులపల్లి గ్రోయిన్ శిథిలావస్థకు చేరి నీరంతా వృథాగా సముద్రం పాలవుతుందని, తక్షణమే మరమ్మతులు చేసి ప్రజలకు తాగునీరు, రైతులకు సాగునీరు అందించాలని గ్రామ అభివృద్ధి పోరాట కమిటీ కన్వీనర్ కోన లక్ష్మణ కోరారు. స్థానిక ఆర్డీవో కార్యాలయంలో సోమవారం జరిగిన ప్రజా సమస్యల పరిష్కార వ్యవస్థలో ఆయన వినతిత్రం ఆందజేశారు. అనంతరం మాట్లాడుతూ గ్రోయిన్‌పై పట్టణంతోపాటు 10 గ్రామాల ప్రజలు, రైతులు ఆధారపడి ఉన్నారన్నారు. రానున్న ఎండ తీవ్రతను దృష్టిలో పెట్టుకొని ఎమ్మెల్యే కొణతాల రామకృష్ణ, సంబంధిత అధికారులు సమస్యను పరిష్కరించాలన్నారు. కార్యక్రమంలో వాయిబోయిన శేఖర్, చిన్ని సత్తిబాబు, మారేడిపూడి సత్యన్నారాయణ, వై సాయిబాబు పాల్గొన్నారు.

నేటి నుంచి ఉపాధి సామాజిక తనిఖీ



మాట్లాడుతున్న ఎంపీడీవో రవికుమార్

కశింకోట: మండలంలో గత ఆర్థిక సంవత్సరంలో నిర్వహించిన జాతీయ ఉపాధి హామీ పథకం పనులకు సంబంధించిన సామాజిక తనిఖీ పంచాయతీల వారీగా మంగళవారం నుంచి ప్రారంభం అవుతుందని ఎంపీడీవో వి.వి. రవికుమార్ తెలిపారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో సోమవారం ఉపాధి హామీ పథకం సామాజిక తనిఖీ నిర్వహణ విషయమై ఇంజనీరింగ్, ఉపాధి సిబ్బందితో సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ మొదటగా పంచాయతీల్లో సామాజిక తనిఖీ చేసి, వాటి వివరాలను గ్రామ సభలు నిర్వహించి ప్రజలకు తెలియజేస్తారన్నారు. చివరిగా మండల స్థాయిలో సామాజిక తనిఖీ జరుగుతుందన్నారు. స్టేట్ రిసోర్స్ పర్సన్ ఎం. నాగరాజు మాట్లాడుతూ గత ఆర్థిక సంవత్సరంలో రూ.13 కోట్ల మేర ఉపాధి పనుల వేతనాల రూపంలోను, మెటీరియల్ రూపంలో రూ.3.63 కోట్లు ఖర్చు చేశామన్నారు. వీటిపై స్టేట్, జిల్లా రిసోర్స్ పర్సన్లు తనిఖీ చేసి వాటి సమగ్ర నివేదికను ప్రజా ప్రతినిధి సమక్షంలో గ్రామ సభలు, మండల ప్రజా వేదిక నుందు తెలిజేయనున్నట్లు తెలిపారు. హౌసింగ్ ఏఈ వి. శ్రీనివాసరావు, ఏపీవోలు ఎం. శ్రీనివాసరావు, శివ, ఇంజనీరింగ్ అసిస్టెంట్లు, టెక్నికల్ అసిస్టెంట్లు, ఉపాధి పథకం ఫీల్డు అసిస్టెంట్లు తదితరులు సమావేశంలో పాల్గొన్నారు.

తాడి గ్రామాన్ని తరలించకపోతే ఉద్యమిస్తాం

- సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు



సమావేశంలో మాట్లాడుతున్న సీపీఎం రాష్ట్ర కార్యదర్శి శ్రీనివాసరావు



తాడిలో రోగులను పరామర్శిస్తున్న శ్రీనివాసరావు

పరవాడ: ఎన్నికల్లో ఇచ్చిన హామీలను తుంగలో తొక్కి ప్రజలను పదేపదే మోసగించడం అన్యాయమని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు మండిపడ్డారు. సోమవారం తాడి గ్రామంలో పర్యటించి, ప్రజల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. కాలుష్య కోరల్లో చిక్కుకున్న తాడి గ్రామాన్ని వెంటనే సురక్షిత ప్రాంతానికి తరలించాలని డిమాండ్ చేశారు. గ్రామాన్ని తరలించే వరకు ప్రజలు ఉద్యమించాలని పిలుపునిచ్చారు. మంచినీరు, గాలి, నేల కాలుష్యానికి గురికావడంతో ప్రజలు అనేక సమస్యలు ఎదుర్కొంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ గ్రామాన్ని తరలించని పక్షంలో ప్రజలతో కలిపి పోరాటం చేస్తామని హెచ్చరించారు. గ్రామాన్ని తరలించాలని కోరుతూ ఈ నెల 24న ఆందోళన చేయనున్నట్లు తెలిపారు. రోగులను పరామర్శించి, వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో సీపీఎం రాష్ట్ర కార్యవర్గ సభ్యులు కె.లోకనాథం, జిల్లా కార్యదర్శి జి.కోటేశ్వరరావు, కార్యవర్గ సభ్యులు ఆర్.శంకర్రావు, గనిశెట్టి సత్యనారాయణ, గండి నాయనబాబు, వివి రమణ, అప్పలరాజు, చిట్టిబాబు పాల్గొన్నారు.

సీతారాముల కల్యాణం



తలంబ్రాలు ఘట్టం నిర్వహిస్తున్న అర్చకులు

సింహాచలం: పాల్గుణ ఏకాదశిని పురస్కరించుకుని సింహగిరిపై గంగధార వద్ద ఉన్న ప్రాచీన రామాలయంలో సోమవారం రాత్రి సీతారాముల వార్షిక కల్యాణ మహోత్సవం వైభవంగా జరిగింది. సీతారాముల ఉత్సవమూర్తులను విశేషంగా ముస్తాబుచేసి కల్యాణమండపంలో శాస్త్రోక్తంగా కల్యాణాన్ని నిర్వహించారు. భక్తులకు కల్యాణ అక్షింతలు, ప్రసాదం అందించారు. ఆలయ స్థానాచార్యులు టి.పి.రాజగోపాల్, అర్చకులు సాతులూరి నరసింహాచార్యులు, శ్రీకాంత్ తదితరులు కార్యక్రమాన్ని నిర్వహించారు. ఏఈవో, సూపరింటెండెంట్ ఏర్పాట్లు పర్యవేక్షించారు.

ఘనంగా కనకమహాలక్ష్మి తీర్థ మహోత్సవం



కనక మహాలక్ష్మిని దర్శించుకుంటున్న మాజీ మంత్రి గుడివాడ అమర్‌నాథ్



అమ్మవారి సేవలో నియోజకవర్గ సమన్వయకర్త మలసాల భరత్‌కుమార్



కనకమహాలక్ష్మి అమ్మవారి అలంకరణ

కశింకోట: మండలంలోని బయ్యవరంలో వెలసిన కనకమహాలక్ష్మి అమ్మ వారి 20వ తీర్థ మహోత్సవం సోమవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అమ్మవారి ఆలయాన్ని పూలమాలలతో అందంగా అలంకరించారు. ఉదయం నుంచి ప్రత్యేక కుంకుమార్చనలు నిర్వహించారు. భక్తులు ఎక్కువ సంఖ్యలో దర్శించుకున్నారు. చీరలు, రవికెలు, అరటి గెలల రూపంలో మొక్కులు తీర్చుకున్నారు. మాజీ మంత్రి గుడివాడ అమర్‌నాథ్ అమ్మవారిని దర్శించుకుని పూజలు చేశారు. వైఎస్సార్ సీపీ నియోజకవర్గ సమన్వయకర్త మలసాల భరత్‌కుమార్, పార్టీ మండలాధ్యక్షుడు మలసాల కిషోర్, అనకాపల్లి పట్టణ అధ్యక్షుడు మందపాటి జానకీరామరాజు, పార్టీ మండల సచివాలయ కన్వీనర్ కలగా గున్నయ్యనాయుడు, యువజన నాయకుడు మలసాల కుమార్‌రాజా, తదితరులు దర్శించారు. వారికి మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్, ఆలయ వ్యవస్థాపక ధర్మకర్త గొల్లవిల్లి శ్రీనివాసరావు, సర్పంచ్ గొల్లవిల్లి జయ ఆలయ మర్యాదలతో దుశ్శాలువాలు కప్పి సత్కరించి జ్ఞాపికలను అందజేశారు. మధ్యాహ్నం భారీ అన్న సమారాధన నిర్వహించారు. రాత్రి తీర్థ మహోత్సవం జరిగింది. ఆట వస్తువులు, మహిళల అలంకరణ వస్తువులు అమ్మకాలు జోరుగా సాగాయి. పలు సాంస్కృతిక కార్యక్రమాలు ప్రదర్శించారు. పెద్ద ఎత్తున బాణసంచా కాల్చారు. పార్టీ సీనియర్ నాయకుడు దంతులూరి దిలీప్‌కుమార్, జిల్లా అధికార ప్రతినిధి మళ్ల బుల్లిబాబు, ఎంపీటీసీ సభ్యుడు గొన్నా నాగ సత్యనారాయణ, తదితరులు కార్యక్రమంలో పాల్గొన్నారు.

పదో రోజుకు రిలే నిరాహార దీక్షలు



నిరాహార దీక్షలో పాల్గొన్న ఆర్టీసీ కార్మికులు

అనకాపల్లి టౌన్: స్థానిక డిపోలో పనిచేస్తున్న కండక్టర్, డ్రైవర్లను తక్షణమే విధుల్లోకి తీసుకోవాలని డిపో ఎదుట చేస్తున్న రిలే నిరాహార దీక్షలు సోమవారానికి 10వ రోజుకు చేరుకున్నాయి. ఈ దీక్షా శిబిరంలో ఏపీపీటీడీ నేషనల్ మజ్దూర్ యూనిటీ అసోసియేషన్ రీజనల్ కార్యదర్శి పి. సుధాకర్ మాట్లాడుతూ 1-2019 సర్కులర్‌కు విరుద్ధంగా అక్రమంగా సస్పెండ్ చేయడం తగదన్నారు. దీక్షలో బీపీ కుమార్, సీహెచ్ఎన్ సత్యవతి, వీడీఎస్‌పి నాయుడు, కేఈ రావు కూర్చొన్నారు.

నేడు పాలిటెక్నిక్ కాలేజీలో క్యాంపస్ ఎంపికలు

పెందుర్తి: హైదరాబాద్‌కు చెందిన మేధా సర్వో డ్రైవ్స్ సంస్థలో ఉపాధి నిమిత్తం స్థానిక పాలిటెక్నిక్ కళాశాల విద్యార్థులకు మంగళవారం క్యాంపస్ ఎంపికలు నిర్వహించనున్నట్లు ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్. చంద్రశేఖర్ తెలిపారు. ఉదయం 9 నుంచి ఇంటర్వ్యూలు ప్రారంభమవుతాయన్నారు.

పాడి రైతుల ఆర్థిక బలోపేతానికి సంఘాలు



మాట్లాడుతున్న సంఘమిత్ర సీఈవో జయచంద్ర

కశింకోట: పాడి రైతులు ఆర్థికంగా బలోపేతం కావడానికి సంఘాలుగా ఏర్పాటు కావాలని పశు వైద్యాధికారి అల్ఫోన్సా జార్జ్ కోరారు. సంఘ మిత్ర ఆధ్వర్యంలో సోమవారం కశింకోటలో అభ్యుదయ పాడి రైతుల సమావేశం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ రైతులు సంఘటితమై సంఘాలుగా ఏర్పడితే ప్రభుత్వం నుంచి వివిధ రూపాల్లో రాయితీలు పొందడానికి అవకాశం కలుగుతుందన్నారు. ఎన్‌డీడీబీ, ఏపీడీడీఈఎఫ్ సంయుక్తంగా ఏర్పాటు చేసిన రూ.2 వేలు విలువ కలిగిన వాటాలను తీసుకుంటే, మేలు జాతి బహు వార్షిక పశుగ్రాసాలను పెంచుకోవడానికిగాని, కొనుగోలు చేసుకోవడానికిగాని అవకాశం ఏర్పడుతుందన్నారు. తక్కువ ధరకు నాణ్యమైన దాణాలు, మందులు, నాణ్యమైన ఎరువులు, పురుగుల మందులు అందుబాటులోకి వస్తాయన్నారు. సంఘ మిత్ర సీఈవో జయచంద్ర మాట్లాడుతూ పాడి రైతులు సంఘాలుగా ఏర్పడటం వల్ల పలు ప్రయోజనాలున్నాయన్నారు. నరసింగబిల్లి పశు వైద్యాధికారి సీహెచ్. చైతన్యమణి, ఉపాధ్యక్షుడు ఆళ్ల అప్పలనాయుడు, ప్రతినిధి ఎస్. చిట్టెమ్మ తదితరులు పాల్గొన్నారు.

పరిశ్రమల్లో భద్రతా ప్రమాణాలు పెంచాలి



ఫార్మాసిటీలో నిర్వహించిన ర్యాలీలో సిటు నాయకులు

పరవాడ: ఫార్మా పరిశ్రమల్లో భద్రతా ప్రమాణాలను పటిష్ట పరచాలని సిటు జిల్లా ఉపాధ్యక్షుడు గనిశెట్టి సత్యనారాయణ డిమాండ్ చేశారు. 54వ జాతీయ భద్రతా వారోత్సవాలను పురస్కరించుకుని సోమవారం ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అనకాపల్లి జిల్లాలో సుమారు 205 పరిశ్రమలు ఔషధాలను ఉత్పత్తి చేస్తుండగా, వాటిలో అనేక పరిశ్రమలు భద్రతను గాలికి వదిలేస్తున్నాయని ఆరోపించారు. కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టిన తరువాత వివిధ పరిశ్రమల్లో 25 మంది కార్మికుల ప్రాణాలు పోగా, 59 మంది క్షతగాత్రులుగా మిగిలినట్లు తెలిపారు. సినర్జీన్ ఫార్మా ప్రమాదం జరిగిన తర్వాత ఏర్పాటు చేసిన ఐఏఎస్ అధికారి మిశ్రా కమిటీ నివేదిక ఏమైందని ప్రశ్నించారు. పరిశ్రమల్లో ఎలాంటి భద్రతా ప్రమాణాలు పాటించట్లేదన్నారు. కార్యక్రమంలో సిటు నాయకులు పి.చిన్నారావు, కేదార్ బాబు, కృష్ణ పాల్గొన్నారు.

చెరువులో బయటపడిన మృతదేహం



సూర్యలక్ష్మీనారాయణ మృతదేహం

పరవాడ: చేపల వేటకు వెళ్లి ప్రమాదవశాత్తు గల్లంతైన భర్నికం గ్రామానికి చెందిన యువకుడు బలిరెడ్డి సూర్య లక్ష్మీనారాయణ మృతదేహం సోమవారం లభ్యమైందని పరవాడ సీఐ ఆర్.మల్లికార్జునరావు తెలిపారు. చిన్న వయస్సులో మృతి చెందిన లక్ష్మీనారాయణ మృతదేహం వద్ద కుటుంబ సభ్యులు కన్నీరుమున్నీరుగా విలపించారు. వివరాలిలా ఉన్నాయి. సూర్యలక్ష్మీనారాయణ తన మిత్రులతో స్థానిక పెద్ద చెరువులో చేపలు పట్టడానికి ఆదివారం మధ్యాహ్నం దిగాడు. ప్రమాదవశాత్తు లోతు ప్రదేశంలో మునిగిపోయాడు. సమాచారం అందుకున్న పోలీసులు, స్థానికులు చెరువులో రాత్రి వరకు మృతదేహం కోసం గాలించినా ఫలితం దక్కలేదు. సోమవారం ఉదయానికి మృతదేహం నీటిలో బయటపడింది. అనకాపల్లి ఎన్టీఆర్ ఆస్పత్రిలో పోస్టుమార్టం నిర్వహించి, మృతదేహాన్ని బంధువులకు అప్పగించారు. మృతుడు పెయింటింగ్ పనులు చేస్తుంటాడు. వివాహం కావాల్సి ఉంది. మృతుడికి తల్లిదండ్రులు నీలమ్మ, లోవ రాజు, ఇద్దరు అన్నదమ్ములు, ఓ సోదరి ఉన్నారు. కేసును సీఐ మల్లికార్జునరావు ఆధ్వర్యంలో ఎస్ఐ బి.కృష్ణారావు దర్యాప్తు చేస్తున్నారు.